సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 18 । మార్చి । 2024



తింటే .. వదలరంతే.!
రంజాన్ మాసంలోనే లభించే హలీమ్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. మటన్, చికెన్, నెయ్యితో చేసిన ఈ వంటకం తింటే ఆ రుచే వేరు.
-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
రాయచోటి :	6.30	4.59
రాజంపేట :	6.30	5.02
పీలేరు :	6.32	5.00
మదనపల్లె :	6.31	5.05

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 19 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	475
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,241.300 కిలోలు

న్యూస్‌రీల్

స్పందన తాత్కాలిక రద్దు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 18వ తేదీ (సోమవారం) నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికలకు అందజేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని ఆయన తెలియపరిచారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాయచోటి: ఒంటిపూట బడులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో స్కూళ్లకు జిల్లా విద్యాశాఖ కీలక సూచనలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దని పేర్కొంది. ఎండల నేపథ్యంలో పాఠశాలల్లో తగినంత తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలియపరిచింది. అలాగే మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు స్థానికుల సమన్వయంతో మజ్జిగ అందించాలని ఆదేశించింది. ఎవరైనా సన్‌స్ట్రోక్‌కి గురైతే సత్వరం వైద్యారోగ్య శాఖ సమన్వయంతో చికిత్స అందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించింది.

కొనసాగుతున్న ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

రాయచోటి: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు ముగియడంతో స్పాట్ వాల్యుయేషన్ కొనసాగుతోంది. అన్నమయ్య జిల్లా రాయచోటి బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 16వ తేదీ నుంచి ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపునకు వివిధ సబ్జెక్టుల జవాబు పత్రాలు చేరుకున్నాయి. మొత్తం నాలుగు దశలలో జవాబు పత్రాల మూల్యాంకనం చేపడుతున్నారు. ఈ క్యాంపు ఆఫీసర్‌గా అన్నమయ్య జిల్లా డీఈఐఓ కృష్ణయ్య ఉన్నారు.

గేట్ ఫలితాల్లో ప్రతిభ



వి.సతీష్‌కుమార్‌రెడ్డి

కొండాపురం: గేట్ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో కొండాపురం మండలం బి. కొట్టాలపల్లె గ్రామానికి చెందిన వి. సతీష్‌కుమార్‌రెడ్డి ఆలిండియా లెవెల్‌లో 451 ర్యాంక్ సాధించాడు.ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ ఆలిండియా లెవల్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో ఫిబ్రవరి నెల 11న గేట్ పరీక్ష రాసినట్లు చెప్పారు.ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసినట్లు తెలిపారు.ర్యాంకు సాధించిన విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నూతన నియామకం



యేసోబు

జమ్మలమడుగు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్‌ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన యేసోబును నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటి ఉత్తర్వులను జారీ చేసింది. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యదర్శి పదవి రావడం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడి చదవాలి



పెన్నులు, ప్యాడ్స్ అందుకున్న విద్యార్థులతో అతిథులు

కడప కల్చరల్: విద్యార్థులు కష్టపడి చదివి భావి భారత విద్యార్థులకు ఆదర్శంగా నిలబడాలని బద్వేలు ఫాతిమా చర్చి రెవరెండ్ ఫాదర్ గొడుగునూరు విజయరావు, మాసాపేట పునీత యోహాన్ చర్చి రెవరెండ్ ఫాదర్ గుడిమే దేవ సహాయం, ఆరోగ్యమాత పుణ్య క్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి.ప్రసాదరావులు పిలుపునిచ్చారు. కడప నగరంలోని శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రలో గొప్ప వారిగా చెప్పుకొనే ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి ముందుకు వెళ్లారని, అలాంటి వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శాంతి సేవా సొసైటీ చిన్నపాటి స్వచ్ఛంద సేవా సంస్థ అయినప్పటికీ వారి సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులకు చదువు పట్ల భయాన్ని పాగొట్టేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ సభ్యులు మడగలం మనోహర్, ఎలిజబెత్, పావని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థీ.. విజయోస్తు

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- 129 కేంద్రాలు, 25522 మంది విద్యార్థులు
- ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ





పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

రాయచోటి/మదనపల్లె సిటీ: విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాల్లో 25522 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ప్రతి కేంద్రంలోనూ మౌలిక వసతులు కల్పించారు. ముఖ్యంగా నేలపై కూర్చుని పరీక్షలు రాయకూడదనే దృఢ సంకల్పంతో అన్ని కేంద్రాల్లోనూ ఫర్నీచర ఏర్పాటు చేశారు. తాగునీరు, నీటివసతితో కూడిన మరుగుదొడ్లు, లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది. తొలి రోజు విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకుని హాల్‌టికెట్ నంబరు చెక్ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

చిన్న పొరపాటుకూ తావీయొద్దు

పరీక్షల నిర్వహణలో తొలిరోజు నుంచి చివరి రోజు దాకా ఏ చిన్న పొరపాటుకూ తావీయొద్దని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఏ కేటగిరి కింద 58 సెంటర్లు, బి కేటగిరి కింద 55 సెంటర్లు, సీ కేటగిరి కింద 16 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందు కోసం 1200 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

25 యాక్టు అమలు

పరీక్షల నిర్వహణలో కఠినమైన 25 యాక్టు అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రంలో ఏ తప్పు జరిగినా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లకే పూర్తి బాధ్యత. సెల్‌ఫోన్లు ఎవరికీ అనుమతించరాదు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను పంపే సమయంలో చెక్ చేసి పంపాలి. సిబ్బంది సమన్వయంతో పని చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులను సూచించారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. 492 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సన్నద్ధమయ్యారు. వీరిలో 22466 మంది రెగ్యులర్, 3056 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. 11254 మంది బాలురు, 11212 మంది బాలికలు ఉన్నారు. జిల్లా పరీక్షల అబ్జర్వర్‌గా మస్తానయ్య ఉన్నారు. పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఆరుగురు ఫ్లైయింగ్‌స్క్వాడ్స్, మధ్యాహ్నం జరిగే ఒకేషనల్ పరీక్షలకు 4 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, బృందం సభ్యులు పర్యవేక్షించనున్నారు. వీరితోపాటు మరో 66 మంది సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణకు 1200 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే సమయంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

డీఈఓ సమీక్ష



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష చేస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను డీఈఓ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలలో తీసుకోవాల్సిన చర్యలపై డీఈఓ శివ ప్రకాష్‌రెడ్డి మరోమారు ఆదివారం పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. రాయచోటిలోని తన కార్యాలయంలో జిల్లాలోని ఉప విద్యాశాఖ, సీనియర్ మండల విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడం తమ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం సర్వం సిద్ధం చేసినట్లు చెప్పారు.కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సెంటర్‌లో సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రశాంతంగా వెళ్లాలి



విద్యార్థులు నిర్ణీత సమయానికంటే ముందుగా పరీక్ష కేంద్రాలకు వెళ్లాలి. టెన్షన్ పడితే పరీక్షను సరిగా రాయలేరు. మనసులో ఎలాంటి ఆందోళన లేకుంటే పరీక్ష బాగా రాయవచ్చు. పరీక్షకు వచ్చే ముందు ఏదో ఒకటి తిని రావాలి.

– ఓ. వెంకటేశ్వర్‌రెడ్డి, సైకాలజిస్టు

గుడి వద్దకు రమ్మన్నారు.. టీడీపీ కండువా వేశారు



ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వెంగన్నగారిపల్లె గ్రామస్థులు

చాపాడు(వైఎస్‌ఆర్ జిల్లా): ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం చుట్టు ప్రక్కల గ్రామాల్లో తెలిసిన టీడీపీ నాయకులు రామాలయం వద్దకు రమ్మన్నారని, విషయం తెలపకుండా టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ చేత టీడీపీ కండువాలు వేయించారని.. వాస్తవానికి తామంతా వైఎస్సార్‌సీపీ వర్గీయులమని మండలంలోని వెంగన్నగారిపల్లె గ్రామస్తులు తెలిపారు. అన్నవరం పంచాయతీ పరిధిలోని వెంగన్నగారిపల్లె గ్రామానికి చెందిన డి.రామసుబ్బారెడ్డి, జి.ఎల్లారెడ్డి, ఏ.రామసుబ్బారెడ్డి, కొండారెడ్డి, జి.నడిపి ఎల్లారెడ్డి, డి.వెంకటసుబ్బారెడ్డి, డి.రామచంద్రారెడ్డి, రామాంజనేయరెడ్డి, శివారెడ్డి, మారుతిరెడ్డి, జి.రామాంజనేయరెడ్డి, ఏ.కుళ్లాయిరెడ్డిలతో పాటు 30 కుటుంబాలకు చెందిన వారు గ్రామ ఉప సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కండువా ధరించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. తాము వైఎస్సార్‌సీపీ వర్గీయులమేనని తాము టీడీపీలోకి వెళ్లలేదన్నారు. గ్రామంలో 33 కుటుంబాలు ఉంటే 8 మందికి కండువాలు వేసి 40 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు పత్రికల్లో వేయించారన్నారు. తామంతా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వెంటే ఉంటామని తెలిపారు. అనంతరం గ్రామంలో పలు రకాలైన అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, చాపాడు, దువ్వూరు ఎంపీపీలు లక్షుమయ్య, జయచంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాల ఆలోచనా దృక్పథానికి నిదర్శనం ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్: విశాల ఆలోచనా దృక్పథానికి నిదర్శనం ఇఫ్తార్ విందు అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాయచోటి పట్టణంలోని పండ్లమండీల వద్ద మండీ యజమాని సయ్యద్ యహియాబాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, న్యూ నజీరియా మసీదు వద్ద ఏర్పాటు చేసిన గంజి పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలు, మతపెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇఫ్తార్ పుణ్య కార్యక్రమమని అన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నేతలు బేపారి మహమ్మద్ ఖాన్, ఆసిఫ్‌అలీఖాన్, షబ్బీర్, సాదక్‌అలీ, రియాజ్, రిజ్వాన్, రౌనఖ్‌హుస్సేన్, రియాజుర్ రహిమాన్, నవరంగ్ నిస్సార్, గౌస్‌ఖాన్, మండీ మహబూబ్‌బాషా, జబీవుల్లా, సుగవాసి ఈశ్వర్, శ్యామ్‌కుమార్, జానం రవీంద్ర, అన్నా సలీం, కొత్తపల్లె ఇంతియాజ్, విజయభాస్కర్, గాజుల అష్రఫ్, ఆనందరెడ్డి, హజరత్ ఖాదర్‌వలీ, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటికి మద్దతు పలికిన అడవిబిడ్డలు

రాజంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని ప్రకటించడంతో అడవిబిడ్డల్లో సైతం హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఒంటిమిట్ట మండలంలో అటవీ గ్రామమైన చింతరాజుపల్లె వాసులు మూకుమ్మడిగా తరలివచ్చారు. ఆకేపాటి ఎస్టేట్‌లో ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని వారు కలిశారు. శాలువా కప్పి సన్మానించి, తమ అభిమానం చాటుకున్నారు. తన వద్దకు వచ్చిన అడవిబిడ్డలను ఆకేపాటి సాదరంగా ఆహ్వానించి, వారిని ఆప్యాయంగా పలుకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని, తప్పకుండా అన్ని సమస్యలను పరిష్కరిస్తారనని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతరాజుపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు, రైతులు పాల్గొన్నారు.



ఆకేపాటిని కలిసిన చింతరాజుపల్లె గ్రామస్తులు

పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు

కలెక్టర్ అభిషిక్త్ కిషోర్




మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. పటిష్టంగా అమలు పరచడంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ హాజరై జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాలు, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సివిజిల్లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అదే ఫిర్యాదులపై అదే రోజున చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోసం అన్ని విధాలా సంసిద్ధత ఎంతో కీలకమైందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్–ఎంసీసీ) అమలుపై అందరు ఎన్నికల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీటీమ్‌లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలు, ఇతర క్యాలెండర్లు, జెండాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, రోడ్డుకు ఇరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో అన్ని హోర్డింగ్‌లపై రిటర్నింగ్ అధికారులు సంబంధిత వీఆర్‌ఓలు, ఎంపీడీఓలతో మాట్లాడాలని, అన్నింటినీ తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ రావు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మామిడి.. తగ్గిన దిగుబడి

అన్నమయ్య జిల్లాలో మామిడి సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. పూత సరిగా రాకపోవడంతో దిగుబడి 25 శాతం కూడా మించలేదు. ఒక వైపు కరుణించని ప్రకృతి.. మరోవైపు తగ్గిన దిగుబడి.. ఇంకో వైపు లభించని గిట్టుబాటు.. ఇన్ని సమస్యల మధ్య అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు.

- ప్రకృతితోపాటు దెబ్బతీసిన తెగుళ్లు
- సరిగా రాని పూత
- కాపు 25 శాతం మించని వైనం
- లబోదిబోమంటున్న రైతులు



మామిడి చెట్లకు కాయలు కనిపించని దృశ్యం

రాయచోటి: ప్రకృతి పగబట్టడమే కాదు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని మార్కెట్‌లో అనుకున్న మేర మామిడి రైతుకు మద్దతు లభించడం లేదు. రెండేళ్లుగా ప్రకృతి సహకరించకపోవడంతో అన్నమయ్య జిల్లా పరిధిలోని మామిడి రైతులకు కష్టకాలం వెంటాడుతోంది. చెట్లు పచ్చదనంతో నిండుగా ఉన్నా వాటిలో పూత లేదు.. వచ్చిన పూత రాలిపోవడంతో కాత నిలవలేదు. ఫలితంగా వందల కోట్ల రూపాయల ఆదాయం మామిడి రైతులకు దక్కకుండానే పోతోంది. జిల్లా వ్యాప్తంగా 32 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. గతేడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవడంతో.. ఈ ఏడైనా సరైన దిగుబడులు వచ్చి నమ్ముకున్న రైతులకు తోడుగా నిలుస్తుందని భావించారు. అయితే వారి ఆశలు నెరవేరలేదు. ప్రకృతి కరుణించక, తెగుళ్ల బారిన పడి సస్యరక్షణ సరిగా లేక.. చలి, మంచు ప్రభావం రైతన్నను తీవ్రంగా దెబ్బతీసింది. భారీగా ఉన్న అంచనాల నుంచి ఏదో కొంత మేర దిగుబడి వస్తే చాలనే పరిస్థితి కనిపిస్తోంది. పెద్ద చెట్ల నుంచి ఎకరాకు ఐదు టన్నులకు పైగా దిగుబడి వచ్చే పరిస్థితి నుంచి టన్ను లోపే దిగుబడి పడిపోయింది. ఒకసారి కాదు కదా రెండు మూడు సార్లు పూత వచ్చినా ప్రయోజనం మాత్రం కనిపించలేదు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందంగా.. ముందే దిగుబడి లేక సస్యరక్షణకు పెట్టిన పెట్టుబడులు రాక అల్లాడుతున్న మామిడి రైతులను మార్కెట్‌లో వినిపిస్తున్న ధరల పోటు కలవరపాటుకు గురి చేస్తోంది.

వెంటాడుతున్న తెగుళ్లు

చెట్లు ఆరోగ్యంగా కనిపిస్తున్నా బుడిద, బంక తెగుళ్లు వెంటాడుతున్నాయి. ఈ ఏడాది పూత కొంత వరకు ఉన్నా తెగుళ్ల వల్ల పంటనష్టం అపారంగా ఉండటంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. చిన్న పిందెలు పట్టినా తెగుళ్ల కారణంగా రాలిపోతున్నాయి. సాధారణంగా దిగుబడి లేకపోతే మార్కెట్‌లో వాటికి అధికమైన డిమాండ్, ధరలు ఉండాలి. కానీ నేటికి మామిడికి అనుకున్నంత రీతిలో మార్కెట్‌లో ధరలు లేకపోవడం బాధాకరం. దీంతో లక్షలాది రూపాయల నష్టాన్ని, చేసిన అప్పులకు వడ్డీల భారాన్ని కలిగిస్తున్నాయి.

పెరిగిన పెట్టుబడి

వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా డిసెంబరు నెలలో సమయానికి పూత రాలేదు. నెల రోజులు ఆలస్యంగా పూత రావడంతో పురుగు ప్రభావం అధికమైంది. వచ్చిన కొద్దిపాటి పూత కూడా.. జనవరి, ఫిబ్రవరిలో మంచుదెబ్బకు రాలిపోయింది. తేనె మంచు పురుగు కారణంగా పూత నల్లగా మారిపోతోంది. పిందెలు రాలిపోతున్నాయి. తామరపురుగు ప్రభావంతో మరింత నష్టపోతున్నారు. నివారణకు రైతులు వారానికి ఎకరాకు రూ.6 వేల చొప్పున ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎకరాకు దిగుబడి 2 టన్నులు వస్తుందో లేదో అని కొందరు రైతులు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో టన్నుకు లోపే దిగుబడి ఉందన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.50 నుంచి రూ.75 వేల చొప్పున ముందే చెల్లించి కౌలుకు తీసుకున్నామని అందులో సగమైనా వస్తుందో లేదో అనే ఆవేదన వారిలో కనిపిస్తోంది. కాపు 25 శాతం మించి వచ్చే సూచనలు కనిపించడం లేదని వారు వాపోతున్నారు.



గణనీయంగా పడిపోయిన వైనం

రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా పండ్ల తోటల సాగులో ప్రాధాన్య స్థానంలో ఉంది. మామిడి తోటల సాగులో కూడా గణనీయమైన ప్రగతిని సాధించింది. మామిడిలో ప్రధానంగా లాల్ బహార్, బేనీషా, ఖాదర్, తోతాపురి, బెంగుళూర, ఇమామ్ పసంద్, చెరుకు రసం, సువర్ణరేఖ, మల్లిక, మలుగుబా, దసేరి, నీలం తదితర రకాలను సాగు చేశారు. జిల్లాలో 32 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉండగా, అందులో 30 వేల హెక్టార్లలో కాయలు కాసే చెట్లు ఉన్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యమో, తెగుళ్ల భారమో, చలి మంచు ప్రభావమో తెలియదు గానీ దిగుబడులు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి.

ప్రకృతి అనుకూలించలేదు



మామిడి పంటకు ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. చలి, మంచు, తెగుళ్ల కారణంగా పూత ఆలస్యంగా వచ్చింది. అది రాలిపోవడంతో ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం సాగులో ఉన్న మామిడిలో సరాసరిన ఎకరాకు టన్నుకు మించి దిగుబడి రాదని భావిస్తున్నాం. రైతులు ఎంత సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రకృతి అనుకూలించలేదు. ఫలితంగా 25 శాతంకు మించి దిగుబడి లేదని చెప్పవచ్చు. వచ్చిన దిగుబడికి మార్కెట్ ఎంత వరకు సహకరిస్తుందన్నది మును ముందు తెలుస్తుంది.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

గర్భిణి మృతి

మదనపల్లె సిటీ : మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ఓ గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. రామసముద్రం మండలం అవిసేపల్లికి చెందిన దేవరాజు భార్య మహిత (22) రెండో కాన్పు నిమిత్తం పుట్టినిల్లు నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ కుమ్మరపల్లికి వెళ్లింది. ఇంటి వద్ద నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. మూర్ఛతో అస్వస్థతకు గురై చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లె సమీపంలో ఆదివారం ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ , ఓనర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.ఎల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటికి చెందిన ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ నిత్యం పర్మిట్, బండి నంబర్లు లేని ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక రవాణా చేసేవారన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలోని వంకలో నుంచి ఇసుకను తరలిస్తుండగా సమాచారం మేరకు బండపల్లి బస్‌స్టాప్ సమీపానికి వెళ్లగానే ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కలికిరి మండలం మర్రికుంటపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు మల్లికార్జున స్థానిక నిమ్మనపల్లె రోడ్డులో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే మృతుని భార్య ఉదయశ్రీ ,బంధువులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. తాలూకా పోలీసులు సంఘన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు



గాయపడిన రామసుబ్బమ్మ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామంలో ఆదివారం ఇద్దరిపై తేనెటీగలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన బీరం రామసుబ్బమ్మ, బీరం రాములమ్మలు పొలం పనుల్లో ఉండగా ఒక్కసారిగా పెద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఇరువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానికులు గుర్తించి వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

తింటే .. వదలరంతే.!

హలీమ్ ప్రత్యేకత అంతా దాన్ని వండటంలోనే ఉంటుంది. దాని తయారీ విధానమే హలీమ్‌కు గొప్పతనం తెచ్చిపెట్టింది. రోజంతా కఠోర దీక్ష చేసి రోజా ఉండే ముస్లింలు బలం కోసం తీసుకునే ఈ ఆహారం అన్ని మతాల వారికి ప్రీతిపాత్రమైంది. రంజాన్ మాసంలో ఎక్కడ చూసినా హలీం ఘుమఘుమలే.

- రంజాన్ ప్రత్యేకం నోరూరించే హలీమ్
- చక్కటి పౌష్టికాహార వంటకంగా పేరు



సిద్ధంగా ఉన్న హలీమ్

మదనపల్లె సిటీ : అస్సాలామ్ అలైకుమ్ భాయ్..ఇఫ్తార్ కా వక్త్ హోరహా హై, మస్‌జిద్ చలో. అచ్చా దోస్త్ ఇఫ్తార్ కే బాద్ అచ్ఛీ హోటల్‌పే జాకె హలీమ్ ఖాయేంగే...అచ్చాభాయ్, జరూర్ సే బహుత్ మజేదార్ హలీమ్ ఖాయేంగే'. ఇదీ రంజాన్ మాసంలో సాయంత్రం కలిసిన మిత్రుల సంభాషణ.

కేవలం రంజాన్ మాసంలోనే లభించే హలీమ్ ఎంతో ప్రత్యేకత ఉంది. మటన్, చికెన్, నెయ్యితో చేసిన ఈ వంటకంతో వేయించిన ఉల్లి, కొత్తిమీర, కాస్త పుదీనా, జీడిపప్పు, నిమ్మకాయ వేసుకుని వేడి వేడిగా తింటూ కాస్త పచ్చి ఉల్లి నంజుకుంటే ఆ రుచే వేరు. బలం, రుచికరమైన ఈ వంటను చూస్తే చాలు నోటిలో లాలాజలం ఊరుతుంది. ఒక్కసారి రుచి చూసిన ప్రతి ఒక్కరూ మరోసారి తినాలనుకుంటారు. ఉపవాసదీక్షలు లేని వారు సైతం లొట్టలేసుకుని ఆరగిస్తారు. కేవలం ముస్లింలే కాదు, మాంసాహార ప్రియులు కూడా ఈ వంట వాసనకు ఆకర్షితులై ఒక్కసారైనా రుచి చూడాలని అనుకుంటారు. ఇదీ హలీమ్ ప్రత్యేకత.

హలీమ్ ఘుమఘుమలు

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు. జిల్లాలోని ప్రధానంగా మదనపల్లె, రాయచోటి, రాజంపేటలలోని ప్రధాన వీధుల్లో హలీమ్ వాసన ఘుమఘుమలాడుతుంది. ఆ వాసనకే దీని రుచి చూడాలని కొందరు.. కొత్తగా ట్రై చేసే వారు మరికొందరు. ప్రతి ఏటా దీని రుచిని ఆస్వాదించే వారు ఇంకొందరు. రంజాన్ మెనూలో హలీమ్ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. దమ్ బిర్యానికి ఎంత పేరుందో రంజాన్ సీజన్‌లో దానికి మించి హలీమ్‌కు ప్రత్యేకత ఉంది. పొట్టేలు మాంసం, చికెన్, నెయ్యి, గోధుమ రవ్వ, పిండిని వాడి దీనిని తయారు చేయడంతో ఇది మంచి పోషకాహారంగా చెప్పవచ్చు. ఈ కారణంగా అంతా దీని అభిమానులే. చికెన్ హలీమ్ రూ. 150, మటన్ హలీమ్ రూ.200, ఫ్యామిలీ ప్యాక్ రూ.400 అమ్ముతున్నారు. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండులో 5 చోట్ల, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు చోట్ల హలీమ్ కేంద్రాలు వెలిశాయి.



హలీమ్ కొనుగోలు చేస్తున్న దృశ్యం

రంజాన్ స్పెషల్‌కు భలే ఆదరణ



రంజాన్ నెల ప్రత్యేక వంటకం హలీమ్‌కు భలే ఆదరణ ఉంటుంది. ఏటా హలీమ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది మసాల దినుసులు ధరలు ఎక్కవయ్యాయి. దీంతో ధరలు పెరిగాయి. అయినప్పటికి దీని తయారీకి ప్రత్యేకంగా స్వచ్ఛమైన నెయ్యి , నాణ్యమైన గోధుమలను ఉపయోగిస్తాం. మంచి ఆదరణ ఉంది.

– చాంద్‌బాషా, విక్రయదారుడు, మదనపల్లె

ఈ మాసంలో తప్పనిసరి



హలీమ్ ఇతర మాసాల్లో దొరకదు. మంచి శక్తినిచ్చే పౌష్టికాహారం. రోజంతా ఉపవాసం ఉన్న వాళ్లకి హలీమ్ త్వరగా శక్తినిస్తుంది. దీనిని ఈ మాసంలో తప్పనిసరిగా తింటాం. కుటుంబ సభ్యులూ ఇష్టంగా తింటారు. వారికి తీసుకెళ్లాను.

– షేక్ ముబారక్‌బాషా, మదనపల్లె

రుచిలో రారాజు



రంజాన్ మాసంలో లభించే ప్రత్యేక వంటకం హలీమ్. రుచిలో రారాజు. ఒక్కసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అందుకే దీనికి అంత ప్రత్యేకత. ఉపవాసం ఉన్న వాళ్లే కాదు లేనివారు సైతం ఆరగిస్తారు.

– ఆరీఫ్‌బాషా, మదనపల్లె

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి

కడప కార్పొరేషన్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రవాసాంధ్రులు కృషి చేయాలని గల్ఫ్ కన్వీనర్ బీహెచ్.ఇలియాస్, కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి పిలుపునిచ్చారు. కువైట్‌లోని పర్వానియా నౌషాద్ హోటల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నారన్నారు. సుమారు 600 హామీలిచ్చిన టీడీపీ ప్రభుత్వం ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని, వెంకటేశ్వర స్వామి సాక్షిగా హామీ ఇచ్చిన బీజేపీ మాట తప్పిందన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో విద్యార్థులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంలో, సుడాన్‌లో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జరిగిన అంతర్గత ఘర్షణ సమయంలో 63 మందిని రాష్ట్రానికి తీసుకురావడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. కరోనా సమయంలో ప్రవాసాంధ్రులకు ఏపీ ప్రభుత్వం చేసిన చేసిన మేలు జీవితంలో ఎవరూ మర్చిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు, నాగరాజు, ఎస్.మహేష్‌రెడ్డి, ఎంవీ.నరసారెడ్డి, గౌస్ బాషా, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఏ.లాజరస్, షేక్ షాహుస్సేన్, లక్ష్మీ ప్రసాద్, షేక్ రహమతుల్లా, బీఎన్ సింహా, ఏ.బాలక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన పసుపులేటి కిషోర్ కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఎస్ఐ తనను వేధిస్తున్నాడంటూ రాయచోటి పట్టణానికి చెందిన పసుపులేటి కిషోర్ కుమార్ అనే వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన రాయచోటిలో జరిగింది. ఆదివారం రాయచోటి పోలీస్ స్టేషన్ ఆవరణంలోనే విష ద్రావణం తాగాడు. వెంటనే స్థానికులు గమనించి రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రాయచోటి పట్టణానికి చెందిన పసుపులేటి కిషోర్ కుమార్ తన భార్య నుంచి విడాకులు కావాలని పెద్ద మనుషుల ద్వారా కోర్టును ఆశ్రయించాడు. అయితే పోలీసులు తన భార్యతో కాపురం చేయాలని వత్తిడి చేస్తుండటంతో వారి వత్తిడి భరించలేక ఇలా ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటనపై ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. ఈశ్వర్ స్పందిస్తూ దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఆత్మహత్యాయత్నానికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా పసుపులేటి కిషోర్ కుమార్‌పై అతని భార్య మిస్సింగ్ కేసు పెట్టిందని, విచారణలో భాగంగా అతనిని పిలిచి మాట్లాడామన్నారు. అలాగే కుటుంబ కలహాలు వీడాలని కౌన్సెలింగ్ ఇచ్చినందుకు ఇలా ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



భైరవ కొండమ్మ(ఫైల్)

చాపాడు: మండలంలోని కుచ్చుపాప గ్రామానికి చెందిన బడుగు భైరవ కొండమ్మ(50) అనే మహిళ గత ఆరు రోజులుగా కనిపించడం లేదని ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. మహిళ మానసిక పరిస్థితి సరిగా లేక ఈ నెల 12వ తేదీ ఆసుపత్రికి వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల గ్రామాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవటంతో ఆదివారం మహిళ కుమారుడు మహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కట్టుకున్న భార్యను కడతేర్చాడు



రమణమ్మ(ఫైల్)



మృతురాలి కుమార్తె సంధ్య



యోగానందరెడ్డి (ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : భర్తే కాలయముడిగా మారి కట్టుకున్న భార్యను చున్నీతో గొంతు నులిమి హత్యచేసిన సంఘటన అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం కుర్నూతల గ్రామం బొమ్మేపల్లెలో చోటు చేసుకుంది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు కథనం మేరకు.. రమణమ్మ(32)ను యోగానందరెడ్డి ఎనిమిదేళ్ల క్రితం వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం , నల్లయ్యగారిపల్లెలో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ తరచూ గొడవలు పడేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున పథకం ప్రకారం యోగానందరెడ్డి చున్నీతో రమణమ్మ గొంతు నులిమి హత్య చేశాడు. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన భార్యను హత్యచేశానని చెప్పాడు. దీంతో వెంటనే సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ టీమ్‌తో పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రమణమ్మ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో ఘరానా మోసం

- సుమారు 400 మందిని మోసం చేసిన పీలేరు యువకుడు
- రూ. 10 కోట్లు స్వాహాచేసినట్లు ఆరోపణలు



రెడ్డిసూర్యప్రసాద్ అలియాస్ భరత్



పీలేరు పోలీస్ స్టేషన్‌లో బాధితులు

పీలేరు : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కల్పిస్తామని సుమారు రూ. 10 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన సంఘటన పీలేరులో ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం పలువురు బాధితులు పీలేరు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ఎస్ఐ ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన రెడ్డి సూర్యప్రసాద్ అలియాస్ భరత్ అనే యువకుడు హైదరాబాద్‌లో ఉంటూ అడ్డదారిలో సంపాదించడానికి నిరుద్యోగులకు వల వేశాడు. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు 400 మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వసూలు చేశాడు. రెండు నెలల పాటు వేతనాలు సక్రమంగా చెల్లించి నమ్మించాడు. అనంతరం మొహం చాటేశాడు. దీంతో మోసపోయిన కొంత మంది యువకులు తాము డబ్బులు చెల్లించిన బ్యాంకు అకౌంట్ చిరునామాను గుర్తించారు. హైదరాబాద్, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి సుమారు 400 మంది నిరుద్యోగులు మోసపోయినట్లు తెలుసుకున్నారు. పలువురు బాధితులు తమకు న్యాయం చేయాలని పీలేరు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.

జయాదిత్య న్యూరో కేర్‌లో అత్యాధునిక వైద్య సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని జయాదిత్య న్యూరో కేర్‌లో అన్ని రకాల న్యూరాలజీ సంబంధించిన ఆరోగ్య సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గణేష్ వల్లంపల్లి తెలిపారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఉన్న జయాదిత్య న్యూరో కేర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునిక వసతి సౌకర్యాలు కలిగిన సొంత భవనంలో జయాదిత్య న్యూరో కేర్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ఆరు సంవత్సరాలుగా తమను ఆదరిస్తున్న రాయలసీమ ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పక్షవాతం, మూర్ఛ వ్యాధి, తల నొప్పి, మూతి వంకర పోవడం, మెడ, నడుం నొప్పులు, వెన్నపూస సమస్యలు, తిమ్మిర్లు, అరికాళ్ల మంటలు తదితరాలకు నాణ్యమైన చికిత్స అందిస్తున్నామన్నారు. వణుకు, పార్కిన్ సోనిజం, తల తిరుగుట ,తూలుట లాంటి వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే నరాల బలహీనత, నీరసం, మానసిక సమస్యలు, నిద్ర సమస్యలు, చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపం, కాళ్లు లాగడం, గుంజడం లాంటి సమస్యలు ఉన్నవారు తమను సంప్రదించాలన్నారు. పక్షవాతం వచ్చిన 4 గంటల లోపు మెదడు రక్తనాళంలోని రక్తం గడ్డ కరిగించేందుకు ఐవీ త్రీంబోలైసిస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందన్నారు. ఇతర వివరాలకు 7995325152 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బాకీ డబ్బు విషయమై ఘర్షణ

ఇరువర్గాలపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : బాకీ డబ్బు విషయమై జరిగిన ఘర్షణలో వన్‌టౌన్ పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చి వద్ద నివాసం ఉంటున్న సృజన్ కుమార్ అలియస్ చందు ఆదివారం చర్చికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో అదే వీధిలో ఉంటున్న బుజ్జమ్మ, బెనర్జీ, చెన్నయ్యలు అతన్ని తోసుకుంటూ ఇంట్లోకి తీసుకెళ్లి, దాడి చేసి బెదిరించినట్లు సృజన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుజ్జమ్మ దగ్గర కొంత డబ్బు అప్పుగా తీసుకున్నానని వడ్డీ కట్టని కారణంగా వారు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వడ్డీ లేదా అసలు కావాలని అడిగినందుకు దాడి

రామేశ్వరంలో నివాసం ఉంటున్న బుజ్జమ్మ సమీప బంధువులైన మోషె, అతని తమ్ముడు శేఖర్‌కు 10 ఏళ్ల క్రితం రూ. 10 లక్షలు అప్పుగా ఇచ్చింది. కొన్ని నెలల నుంచి వడ్డీ సరిగా కట్టలేదు, ఈ క్రమంలో వడ్డీ లేదా అసలు అయినా కట్టమని బుజ్జమ్మ వారిని అడుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం మోషె కుమారుడు చందు ఆమె ఇంటి వద్దకు వచ్చి డబ్బు ఇచ్చేది లేదని, ఏం చేసుకుంటారో చేసుకోండని దబాయించసాగాడు. బయట మాట్లాడటం ఎందుకు ఇంట్లోకి వచ్చి మాట్లాడు అని సర్ది చెబుతూ అతన్ని బుజ్జమ్మ కుటుంబ సభ్యులు ఇంట్లోకి తీసుకెళ్లారు. అంతలోనే మోషె, శేఖర్ తదితరులు వారి ఇంటి వద్దకు వచ్చి అంతు చూస్తామని బెదిరించి గొడవ చేశారని బుజ్జమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వడ్డీ చెల్లించలేదని దాడి

తీసుకున్న అప్పునకు వడ్డీ చెల్లించలేదనే కారణంతో తనపై శ్రీనివాసులు అనే వ్యక్తి దాడి చేశాడని సురేష్‌కుమార్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజబాటవీధికి చెందిన తోటంశెట్టి సురేష్‌కుమార్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. అతను రెండేళ్ల క్రితం చల్లా శ్రీనివాసులు అనే వ్యక్తి వద్ద రూ. 21 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో అతను ప్రతి నెలా వడ్డీతో పాటు కొంత అసలు కడుతూనే రూ. 15 లక్షలు వరకు అప్పు చెల్లించాడు. మిగిలిన మొత్తానికి నెల నెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఒక నెల వడ్డీ డబ్బు కట్టలేదు. దీంతో సురేష్‌కుమార్ ఆదివారం దుకాణంలో ఉండగా శ్రీనివాసులు అక్కడికి వెళ్లి దుర్భాషలాడుతూ ఇనుప పాత్రతో దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్క ఇంటికే కన్నం వేశాడు



నిందితుడిని విచారిస్తున్న అర్బన్ సీఐ, సిబ్బంది

రాయచోటి టౌన్ : అక్క ఇంటిలోనే తమ్ముడు చోరీకి పాల్పడిన సంఘటన రాయచోటిలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డులో ఉన్న ఎస్టీ కాలనీలో తిరుపతమ్మ నివాసం ఉంటోంది. ఆమె ఆదివారం పనిపై బయటికి వెళ్లింది. ఇదే సమయంలో స్వయాన తమ్ముడు అయిన తిరుమలేసు అదునుగా భావించి ఇంటిలో ఉన్న బీరువాలో దాచి ఉన్న రూ.1,70,000లు నగదు దోచుకెళ్లాడు. ఇంటికి వచ్చి చూడగా బీరు తెరిచి ఉండటంతో పాటు అందులో ఉన్న డబ్బు కనిపించలేదు. దీంతో ఆమె లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సుధాకరరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. స్థానికులు, బాధితురాలు ఇచ్చిన ఆధారంతో తమ్ముడే దొంగగా భావించి తిరుమలేసును అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దోచుకెళ్లిన డబ్బును తిరిగి పోలీసులకు అప్పగించాడు. నిందితుడిపై సీఐ సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో వేగంగా విచారించడంతో పాటు నిందితుడిని కొన్ని గంటల వ్యవధిలోనే పట్టుకున్న ఎస్ఐ భక్తవత్సలం, లోకేష్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ జగన్, బర్కత్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతుడు రామదాసు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో ఉమ్మడిశెట్టి రామదాసు (65) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు రామాపురం మండలం సుద్దమల గ్రామానికి చెందిన వ్యక్తి అని, గత రెండు సంవత్సరాల క్రితం ఇంటి నుండి వచ్చి జ్యోతిలో అక్కడక్కడ తిరుగుతుండేవాడని తెలిపారు. ఇతడు అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడన్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో చూపించుకుని గ్రామంలోని అంకాలమ్మ అరుగు దగ్గర ఆయాసం ఎక్కువై కత్తితో పొడుచుకుని చనిపోయాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్లతో ప్రజాస్వామ్యానికి ముప్పు

కడప ఎడ్యుకేషన్ : ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వందల కోట్ల రుపాయలు రాజకీయ పార్టీలు పొందడం, తదుపరి తాము అధికారంలోకి వచ్చినప్పుడు తమకు విరాళంగా ఇచ్చిన సంస్థలకు మేలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు సురేష్ బాబు పేర్కొన్నారు. అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎలక్టోరల్ బాండ్ల అంశంపై ఆదివారం చర్చా వేదిక జరిగింది. ఈ సమావేశంలో సురేష్‌బాబు ఆమాట్లాడుతూ ఆర్థిక బలంతో ఎన్నికలలో ప్రభ్యర్థులను అనైతిక పద్ధతుల్లో ఓడించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచినట్టేనని అన్నారు.

బీజేపీ, మిత్ర పక్షాలను ఓడించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఓబులేసు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీస్తున్న ఫాసిస్టు బీజేపీతోపాటు దాని మిత్రపక్షాలను ఓడించేందుకు సమాయత్తం కావాలని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, హరినాథ్ రెడ్డి మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన మోడీ సర్కార్ 10 సంవత్సరాల పాలనలో ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, ప్రజాకంటక ప్రభుత్వంగా ముద్ర వేసుకుందన్నారు. ఆ ముద్ర నుంచి బయటపడేందుకు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన, పన్నుల భారం తగ్గింపు, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు, విభజన హామీలు అమలు ఇలా అన్ని విషయాల్లో విఫలమయ్యారన్నారు. స్వాతంత్రానికి పూర్వం నుంచి పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, కార్మిక చట్టాలను సమూలంగా మార్పు చేసి దోపిడీకి ద్వారాలు తెరిచారని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోగా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. విద్యారంగాన్ని పూర్తిగా కాషాయమయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోలు, డీజిల్ ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా ఎగువభద్రకు జాతీయ హోదా, కృష్ణా జలాల పంపిణీపై సమీక్ష వంటి వ్యతిరేక చర్యలకు మోదీ ప్రభుత్వం పాల్పడిందన్నారు. ప్రజలు, ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెట్టి కులం, మతం, దేవుడు, దేశభక్తి పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టడం దారుణమన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థలను పూర్తిగా బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందన్నారు. బీజేపీ విధానాలను ప్రశ్నించే రాజకీయ పక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సీఏఏ తెచ్చి ముస్లిం మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా ముద్ర వేసేందుకు యత్నిస్తోందన్నారు. సాగు చట్టాలు రద్దుచేసి గిట్టుబాటు ధర కల్పించాలని అడిగిన రైతులను కాల్చి చంపిందన్నారు. దేశ సంపదను కొల్లగొట్టే అంబానీ, అదాని కంపెనీలకు ఊడిగం చేస్తూ, సంపద సృష్టిలో భాగస్వామ్యం అయ్యే శ్రామిక వర్గాన్ని మరింత దోపిడీ చేస్తోందన్నారు. దేశ సమైక్యత సమగ్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న బీజేపీ విధానాలను ప్రశ్నించాల్సిన పాలక, ప్రధాన ప్రతిపక్షాలు బీజేపీతో అంటకాగుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి ఆకాంక్ష, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాయని వారు విమర్శించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాల ఓటమికి, ఇండియా కూటమి గెలుపునకు కృషి చేయాలని వారు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలువురు సీపీఐ, మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.